క్లుప్తంగా

కవితల్లో సామాజికత ప్రతిబింబించాలి

హన్మకొండ కల్చరల్: కవులు తమ కవితల్లో సామాజికత ప్రతిబింబించినప్పుడే కవితలకు సార్థకత లభిస్తుందని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర కౌన్సిలర్ నల్లెల్ల రాజయ్య అన్నారు. తెరవే ఆధ్వర్యంలో పున్నమినాటి ముచ్చట్లు పేరిటా నెలకొకసారి పౌర్ణమిరోజున కవులు సమావేశమై తమ కవితలను వినిపిస్తారు. ఈ మేరకు హనుమకొండ జయశంకర్ ఏకశిల పార్కులో గురువారం జరిగిన సమావేశంలో రాజయ్య పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కవులు రామబ్రహ్మాచారి, నక్క కుమారస్వామి, మల్లికార్జున్, ప్రసూన, నిధి బ్రహ్మచారి, సాదు మహేందర్, బూర భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మిత్రధర్మానికి ప్రతిరూపం రామాయణం

హన్మకొండ కల్చరల్: మిత్రధర్మానికి ప్రతిరూపం రామాయణమని ఆధ్యాత్మిక ప్రవచన కర్త అన్నదానం సుబ్రహ్మణ్యం అన్నారు. వరంగల్ ఏకశిల వైభవ మండలి ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీరోడ్డులోని రెడ్డి మ్యారేజ్‌హాల్‌లో జరుగుతున్న శ్రీమద్రామాయణ సప్తాహం ఆరో రోజు కార్యక్రమం గురువారం సాయంత్రం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం పాల్గొని మైత్రి బంధం – రామాయణం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ కార్యక్రమంలో మండలి బాధ్యులు సౌమిత్రి లక్ష్మణాచార్య, ఆచార్య గిరిజామనోహర బాబు, కృష్ణమూర్తి, అభిమానులు పాల్గొన్నారు.

రేపు శ్వేతార్కాలయానికి మధుసూదనానంద స్వామి

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని మధుసూదనానంద సరస్వతి స్వామి శనివారం సందర్శించుకోనున్నట్లు ఆలయ మేనేజర్ ఎల్.రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం ఆవరణలోని 29 దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భక్తులకు అనుగ్రహ భాషణం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి సంస్మరణ ఉంటుందని, ఆలయ కార్యకర్తలు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కబ్జాదారులపై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: భీమారంలోని శ్యామల చెరువు కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ చల్లా ప్రసాద్‌ను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. సర్వే నంబర్ 842లో సుమారు 67.22 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని పేర్కొన్నారు. అందులో శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ కబ్జాకు గురైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఆకుల కుమార్, ఏ.రమేష్, పీ.రమేష్, శ్రీధర్, శరత్ కోరారు.

సౌండ్ సిస్టం బహూకరణ



హసన్‌పర్తి: హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలకు సౌండ్ సిస్టంను బహూకరించారు. సుమారు రూ.55 వేల విలువగల సిస్టంను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మికి 1978 – 79 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యాకమిటీ జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు చకిలం రాజేశ్వర్‌రావు, గ్రామ విద్యాకమిటీ అధ్యక్షుడు యాదగిరి, పూర్వ విద్యార్థులు వల్లాల సదానందం, కందకట్ల కుమారస్వామి, బత్తుల రమేష్, నన్నంశెట్టి స్వామి, చకిలం సులోచన, వింజమూరి రమాదేవి, శారద పాల్గొన్నారు.

ఆ కళాశాలను మూసివేయాలి

విద్యారణ్యపురి: హనుమకొండ నగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల పలు బ్రాంచీలతో కొనసాగుతోందని, దాన్ని మూసివేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఐఈఓ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల అనుమతి లేకుండా నడుస్తున్నప్పటికీ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, బాధ్యులు సాయి కార్తీక్, సందీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ పదోన్నతి రద్దు చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ల్యాబ్ అసిస్టెంట్ నర్సింగ్‌కు సూపరింటెండెంట్‌గా అక్రమంగా పదోన్నతి కల్పించారని, ఆ పదోన్నతిని రద్దు వెంటనే చేయాలని కాకతీయ యూనివర్సిటీ ఎస్‌జీకే అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి, జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు ఈ-మెయిల్ ద్వారా గురువారం ఫిర్యాదు చేశారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

గణతంత్ర వేడుకలకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించనున్న ఉత్సవాలకు నగరవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ పరేడ్ మైదానాన్ని సిద్ధం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు రిహార్సల్ నిర్వహించారు. జాతీయ జెండాలను అధికారులు ఆవిష్కరించనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వేడుకలకు సిద్ధమైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



విద్యుత్ బల్బుల వెలుగుల్లో బల్దియా ప్రధాన కార్యాలయ భవనం



ముస్తాబైన వరంగల్ కలెక్టరేట్ భవనం

అమీర్ అలీఖాన్‌కు సన్మానం

న్యూశాయంపేట: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా కార్యవర్గ సభ్యులు హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నయీమ్, ఖాదర్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

కందుల బండ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని న్యూశాయంపేటలోని కందుల బండ ప్రాంతంలో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చి, పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఎం మండల నాయకుడు ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కాజీపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో చుక్కయ్య మాట్లాడారు. గతేడాదిగా కందుల బండ ప్రభుత్వ భూమి ప్రాంతంలో పేదలు వేసుకున్న గుడిసెలను దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారులు, రియల్టర్ల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని, నిరుపేద గుడిసెవాసులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భావసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రమేష్, దండు మొగిలి, ప్రభాకర్, శిరీష, విమల, లలిత, రేణుక, జ్యోతి, లక్ష్మి, రమ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలి



న్యూశాయంపేట: మైనార్టీలకు ఉన్నత విద్యాబోధన అందిస్తున్న మైనార్టీ గురుకులాల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను గురుకులం విద్యార్థులు కోరారు. ఈమేరకు వరంగల్ దూపకుంట రోడ్డు నుంచి వరంగల్ (జీ2) బాలికల గురుకులం నుంచి విద్యార్థినులు శంభునిపేట జంక్షన్ వరకు గురువారం ర్యాలీ తీసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నీలిమాదేవి మాట్లాడుతూ ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు చెప్పారు. మైనార్టీలకు 75శాతం, నాన్ మైనారిటీలకు 25 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్సీగా కోదండరాం నియామకంపై హర్షం



సంబురాలు నిర్వహిస్తున్న మల్లేశ్వర్, బాధ్యులు

కేయూ క్యాంపస్: ప్రొఫెసర్ కోదండరాంను ఎమ్మెల్సీగా నియమించడంతో పూలే ఆశయసాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు వద్ద గురువారం సంబురాలు నిర్వహించారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్ మాట్లాడుతూ మేధావులైన కోదండరాంలాంటి వారికి, రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన వారికి సముచిత స్థానం కల్పించడం, తెలంగాణ అమరవీరుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుండడం శుభసూచకమని కొనియాడారు. కార్యక్రమంలో కేయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ మంద వీరస్వామి, పూలే ఆశయ సాధన సమితి బాధ్యులు పాల్గొన్నారు.

కోదండరాంకు శుభాకాంక్షలు

హసన్‌పర్తి: ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంకు కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ అధ్యక్షుడు పింగిళి వెంకట్రామ్ నర్సింహారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని కోదండరాంను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అగ్రికల్చరల్ వర్సిటీ భూమిని కేటాయించొద్దు



కేయూ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి కేటాయించడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు వ్యతిరేకించారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ అగ్రికల్చరల్ యూనివర్సిటీకి చెందిన వంద ఎకరాల భూమిని హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన జీఓను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైకోర్టుకు వేరేచోట కమర్షియల్ భూములు లేదా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లోని భూములను కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ జాయింట్ సెక్రటరీ స్టాలిన్, బాధ్యులు సాయిచరణ్, కార్తీక్, శ్రుతి, రమ్య, మౌనిక పాల్గొన్నారు.

ఝూన్సీపై పోలీసుల దాష్టీకం

హన్మకొండ: రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ భూములను ఇతర అవసరాలకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించిన ముదిరాజ్ కులస్తురాలు చింతకాయల ఝాన్సీపై పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ విమర్శించారు.

రైల్వే సంఘ్ సీడబ్ల్యూసీ సభ్యుల నియామకం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే లోకోషైలెట్ చింత మురళి, రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో సీనియర్ టెక్నీషియన్ సాదినేని వెంకటనారాయణ.. రెండవసారి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులుగా నియామకం అయ్యారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ జోన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ రాఘవయ్య ఉత్తర్వులు జారీచేశారు.

ముఖ్య ఆర్థిక వనరుగా పర్యాటకం



సురేష్‌లాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: దేశంలో ముఖ్య ఆర్థిక వనరుగా పర్యాటక రంగం నిలుస్తోందని కాకతీయ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్ అన్నారు. యూనివర్సిటీలోని చరిత్ర, టూరిజం విభాగం ఇన్‌చార్జ్ డాక్టర్ బ్రహ్మయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన పర్యాటక దినోత్సవంలో సురేష్‌లాల్ మాట్లాడారు. దేశంలో అనేక గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. ప్రాచీన దేశాలయాలతోపాటు చారిత్రక ప్రదేశాలున్నాయని గుర్తుచేశారు. అనంతరం సురేష్‌లాల్‌ను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాజకుమార్, డాక్టర్ నరేందర్, డాక్టర్ కృష్ణసుమంత్, డాక్టర్ నాగేశ్వర్ రావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐని సస్పెండ్ చేయాలి



తెలంగాణ జంక్షన్‌లో ధర్నా చేస్తున్న గోర్‌సేనా నాయకులు

కాశిబుగ్గ: గిరిజన మహిళాపై దాడి చేసిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని గోర్ సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారిలో తెలంగాణ జంక్షన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీసుకొండ మండలం జాన్‌పాకలో నివాసం ఉంటున్న తేజావత్ బుజ్జి అనే గిరిజన మహిళ.. ఈనెల 19న వ్యక్తిగత పనుల నిమిత్తం మెయిన్ రోడ్డుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో జీపు(టాటా సుమో)లో నుంచి నలుగురు వ్యక్తులు దిగి రమేష్‌చంద్ర సార్ రమ్మంటున్నారని ఆమెను జీప్ దగ్గరకు తీసుకువెళ్లారని తెలిపారు. అనంతరం అకారణంగా ఆమెను కర్రలతో కొడుతూ కులం పేరుతో దూషించారని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన మహిళను కొట్టిన సీఐపై ఎస్సీ, ఎస్టీ కింద అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సూచించారు. ధర్నా కార్యక్రమంలో బాధితురాలితో పాటు గోర్‌సేనా నాయకులు తేజావత్ ఫణికుమార్, బోడ కిషన్‌నాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ యువత బాధ్యత



ఖిలా వరంగల్: ఓటరు చైతన్య ర్యాలీ



మోదీ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రావు పద్మ



జ్ఞాపిక అందుకుంటున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్: దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో యువత బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా శంభునిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల ఆధ్వర్యంలో ఓటరు చైతన్య ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ ఔన్నత్యాన్ని కాపాడడంలో యువత కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వీరాంజనకుమార్, అధ్యాపకులు రజిత, మల్లారెడ్డి, సుధాకర్, మమత, రూపారాణి, అనిల్‌కుమార్, ఎల్లాస్వామి, హేలు నాయక్, అనిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. నవభారత నిర్మాణానికి తోడ్పాటు

నయీంనగర్: దేశ అభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని, నవయువ ఓటు – నవభారత నిర్మాణానికి తోడ్పాటు అవుతుందని బీజేపీ హనుమకొండ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా 5వేల కేంద్రాల్లో నిర్వహించిన నమో నవమతదాత సమ్మేళనం (యువ ఓటర్స్ సమ్మేళనం) కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్లతో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం వర్చువల్ మాట్లాడారు. ఈ సందర్భంగా హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందం గౌడ్, వరంగల్ పశ్చిమ కన్వీనర్ కందగట్ల సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఓటరు మోటివేటర్‌గా శ్రీనివాసరావు

రామన్నపేట: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఓటరు మోటివేటర్‌గా నిలిచిన కొడిమాల శ్రీనివాస్‌రావుకు జ్ఞాపిక అందించి వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. 14ఏళ్లుగా ప్రజలకు ఓటుపై శ్రీనివాస్‌రావు చైతన్యం కలిగించేలా అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ర్యాలీలు, వీధి నాటకాలు, వివిధ చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువతను ఓటరుగా నమోదు చేయించి ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చైతన్యపర్చినందుకుగాను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆయనను కలెక్టర్ అభినందించారు.

సంక్షిప్తంగా

వేం నరేందర్‌రెడ్డికి సన్మానం

కేయూ క్యాంపస్: కేబినెట్ హోదాతో సీఎం రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమితులైన వేం నరేందర్‌రెడ్డిని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్, కాకతీయ యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గాదె దయాకర్ హైదరాబాద్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి రాజనర్సింహకు..

కేయూ క్యాంపస్: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల డీన్, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య హైదరాబాద్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు..

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రతినెల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం నిర్వహించిన 'ఫ్యామిలీ ఫెస్ట్'లో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించినట్లు ప్రిన్సిపాల్ రాజశ్రీ తెలిపారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులు, పెద్దలను గౌరవించాలని సూచించారు. పాఠశాల డీన్ రంజిత్, సిబ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, స్మార్ట్ లివింగ్ ఇన్‌చార్జ్ శ్వేత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరికి సమాన విద్యనందించాలి

ఖిలా వరంగల్: సమాజం అభివృద్ధి చెందాలంటే అందరికి సమానమైన విద్యను అందించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్ గౌడ్ సూచించారు. ఖమ్మం పట్టణంలో ఫిబ్రవరి 11,12 తేదీల్లో నిర్వహించనున్నట్లు మహాసభ వాల్ పోస్టర్లను ఖిలా వరంగల్ పడమరకోటలోని ప్రభుత్వ ఆర్య బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో పూర్ణ, రవి, నరేందర్, సునీత, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ: పేద రెడ్డి కులస్తుల సంక్షేమం కోసం రెడ్డి కార్పొరేషన్, విదేశీ విద్యానిధి ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి కోరారు. ఈమేరకు హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రెడ్డి సంఘం ప్రతినిధులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి నల్ల సంజీవరెడ్డి, ప్రతినిధులు బద్దూరు వెంకటేశ్వర్ రెడ్డి, నవల సత్యనారాయణ రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, మాడ్గుల పాపిరెడ్డి, అర్జుల కిషన్‌రెడ్డి, వసంతారెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీలతారెడ్డి, లింగారెడ్డి, లోకమంతా రెడ్డి, కిరణ్ రెడ్డి, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

గొల్ల, కురుమలు రాజకీయంగా ఎదగాలి

కాజీపేట: గొల్ల, కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా మరింతగా ఎదగడానికి ఐకమత్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాజీపేట పట్టణంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లింగయ్య, ఉప్పనపల్లి నాగేశ్వర్ రావు, దాసరి శ్రీకాంత్, జక్కుల మల్లేశం, జయవర్ధన్, వంకర్ల కుమారస్వామి, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

హసన్‌పర్తి: హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ సరోజన గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పీఏసీఎస్ చైర్మన్ ఉదయ్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ పరామర్శించారు.

సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలోని టీపీసీసీ రాష్ట్ర స్థాయి బూత్ కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు గురువారం తరలివెళ్లారు. వర్ధన్నపేట నియోజకవర్గం 14వ డివిజన్ ఏనుమాముల నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. అలాగే, వరంగల్ జిల్లా లీగల్ సెల్ నాయకులు వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌మోహన్, హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గంగిడి శ్రీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, న్యాయవాదులు వెళ్లారు. ఓసిటీలోని తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బస్సులో హైదరాబాద్‌కు నాయకులు తరలివెళ్లారు.


క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

మామునూరు: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, దేహదారుఢ్యానికి, ఆరోగ్యం, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడుతాయని అడిషనల్ కమాండెంట్ రాంబాబు, కృష్ణవేణి హైస్కూల్ ఎండీ శ్రీనివాస్, స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఐనుగాల శోగిరెడ్డి తెలిపారు. మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో టీఎస్ఎస్పీ కృష్ణవేణి హైస్కూల్స్ హెచ్‌ఎంలు సత్యనారాయణ, శిరీష, రాజేంద్రప్రసాద్, కల్యాణ్‌రామ్ ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలు గురువారం సాయంత్రం ముగిశాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీ, బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

3వ డివిజన్ పైడిపల్లిలో..

వరంగల్: యువతలో స్నేహభావం పెంపొందడానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ.మహేందర్ తెలిపారు. 3వ డివిజన్ పైడిపల్లిలో జై జవాన్ – జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన 45వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ బాలికల చాంపియన్‌షిప్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో జై జవాన్ – జై కిసాన్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు జన్ను కుమార్, సెక్రటరీ ఇట్యాల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ జన్ను రాజయ్య, చక్కి రస్వామి, సారంగపాణి, రమేష్, బొల్లం విజయ్, రంజిత్, ఐత కిషన్, ఎనబోతుల కిషన్, చిన్ని, సంపత్, శ్రీనివాస్ కోచ్‌లు జన్ను విజయ్, గణిపాక హరీష్, హ్యాండ్‌బాల్ సీనియర్ క్రీడాకారులు ఈ జట్టుకు కోచ్ అండ్ మేనేజర్ మీనా, జన్ను రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే క్రికెట్‌లో డీజిల్ ఇన్‌స్టిట్యూట్‌దే విజయం



కాజీపేట రూరల్: రిపబ్లిక్ డే సందర్భంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట రైల్వే స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఫైనల్స్ పోటీని ప్రారంభించారు. డీజిల్ ఇన్‌స్టిట్యూట్ జట్టు – కాజీపేట ఆర్‌పీఎఫ్ జట్టు హోరాహోరీగా తలపడ్డాయి. ఇందులో డీజిల్ ఇన్‌స్టిట్యూట్ విజయం సాధించింది. రైల్వే కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం జరిగే కార్యక్రమంలో క్రికెట్, ఇతర పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. క్రికెట్ ఫైనల్స్ పోటీలను ఈఎల్ఎస్ రైల్వే సీనియర్ డీఈఈ, కాజీపేట రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ చైర్మన్ ఆర్.ప్రశాంతకృష్ణసాయి, డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ స్వరాజ్ కుమార్, ఏడీఎంఈలు భానుప్రకాష్, నాగరాజు వీక్షించారు.

స్టేడియంపై విమానం చక్కర్లు

కాజీపేట రైల్వే స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ జరుగుతుండగా స్టేడియంపై నుంచి విమానం చక్కర్లు కొట్టింది. వరంగల్ మామునూరుకు వచ్చిన ఏయిర్ క్రాఫ్ట్ వారికి రైల్వే నాయకుడు పరిచయం ఉండడంతో స్టేడియం మీదుగా వెళ్లాలని కోరగా విమానం వచ్చి వెళ్లిందని రైల్వే నాయకులు తెలిపారు.